

# అన్వేషణ

సింగరాజు లింగమూర్తి

మైసూరు కేఫ్‌లో కాఫీ తాగి శర్మ బైటికి వచ్చి సిగరెట్ ముట్టించి ఒక్క గుక్క పీల్చాడో లేదో, వంగబడిపోతూ ఎదురుగా వచ్చి నిలుచున్నాడు ఒక వ్యక్తి. కట్టుకున్న బట్టలు వాలికలై ముట్టిగొట్టుకున్నాయి. గడ్డం బాగా మాసింది. తలంతా జడలు కట్టుకుపోయి చూడ్డానికి మహా రోతగా వున్నాడు. 'ఎవరో పిచ్చివాడనుకున్నాడు శర్మ. అతను నవ్వాపి, శర్మ కళ్ళల్లోకి తీక్ష్ణంగా చూచాడు. ఆ చూపుల్ని భరించలేకనో, అతని ముఖంలోకి చూసే ధైర్యం లేకనో శర్మ తన చూపుల్ని మరలించాడు. అతను సిగరెట్ ఇవ్వమన్నట్టుగా సంజ్ఞ చేశాడు. "పాపం సిగరెట్ తాగాలని బుద్ధిపుట్టిందేమో" అనుకుంటూ శర్మ జేబులోకి చెయ్యిపోనిచ్చాడు గాని "ఇంత ఖరీదైన సిగరెట్ వీడిముఖాన కొట్టడమా" అనుకొని ఆ ప్రయత్నం మానేశాడు. అతనెంతో ఆశతో శర్మవంక చూస్తున్నవాడల్లా ఆ రీతిచెయ్యి చూడడంతో తనసొమ్మంతా ఎవరో దోచుకున్నటు ముఖంపెట్టి మళ్ళీ శర్మవంక చురచుర చూచాడు. ఆ చూపు ఎక్కడో చూసినట్టు స్ఫురించింది శర్మకు. కాని ఎక్కడో ఏ సందర్భంలోనో మాత్రం గుర్తు రాలేదు. భయంతో నేమో శర్మ అతనివంక చూడలేకపోతున్నాడు. ఇంతలో 'హల్లో' అంటూ రఘువచ్చి శర్మభుజంమీద చేయి వేసేప్పటికి ఎక్కడలేని ధైర్యం వచ్చింది.

"కారేమైంది—ఇక్కడ నిలబడ్డావ్" అన్నాడు రఘు. "పెట్రోలుకోసం తీసుకు వెళ్ళాడు డ్రైవరు. ఈలోగా కాఫీ తాగుదామని ఇక్కడ దిగాను." అన్నాడు శర్మ.

"అలా ఆ వ్యక్తి తనవంక చూస్తుంటే తనెందుకు భయపడాల్సి వచ్చింది?" అని ప్రశ్నించుకున్నాడు శర్మ. తనలో ఏమూలో దాగివున్న పిరికితనం అతనివంక సూటిగా చూడనివ్వలేదనుకున్నాడు. "ఏమిటి ఆలోచిస్తున్నావ్? ఆ పిచ్చివాణ్ని గురించేనా?" అన్నాడు రఘు. తనలోని పిరికితనాన్ని రఘుకు చెప్పడానికి అభిమానపడ్డాడు శర్మ.

పిచ్చివాడు నడిరోడ్డుమీద నిలబడి అటు-ఇటూ అంగలు వేస్తున్నాడు. చుటూ కొంతమంది పిలలు గుమిగూడి చిన్న చిన్న రాళ్ళు, కాల్చి పారేసిన సిగరెట్ పీకలు, ఖాళీ సిగరెట్ డబ్బాలు పిచ్చివాడిమీదకు విసురుతున్నారు. అంతమంది పిలలమధ్య అతను ఒక్కడైపోయాడు. ఒక కుర్రాడు వెనకనుంచి వెళ్ళి జుట్టు పీకాడు. అతను అటు తిరిగేటప్పటికి రెండోవైపునుంచి మరోకుర్రాడు చొక్కా పట్టుకులాగాడు. పిల్లలదాడికి తట్టుకోలేక పిచ్చివాడు పరుగు పెట్టాడు వెనకనుంచి పిలలుకూడా పొలికేకలతో పరుగెత్తుతూ రాళ్ళు విసురుతున్నారు. శర్మ ఈ దృశ్యాన్నంతా కళ్ళప్పగించి చూస్తున్నాడు. రఘు మరెవరితోనో మాట్లాడుతూ నిలబడ్డాడు. శర్మ కెందుకో అనుకోకుండానే కళ్ళు చెమ్మగిలినాయి. రఘుతో మాట్లాడుతున్న వ్యక్తి వెళ్ళడంతో శర్మ వైపు తిరిగి, "ఏమిటోయ్-నీకొక్కడా మతి చెడిందా ఏం ఖర్మ" అన్నాడు. "నిజంగానే తనకు మతి చెడుతుందేమో" అనుకున్నాడు శర్మ. రఘు ఖాళీ సిగరెట్ డబ్బీ పారేసి, "సిగరెట్ ఏదోయ్" అన్నాడు. సిగరెట్ కేసు అందిస్తుంటే శర్మ మనస్సులో పిచ్చివాడు మెదిలాడు. "అతనికి సిగరెట్ ఎందుకివ్వలేకపోయాడు తను?" అని ప్రశ్నించుకున్నాడు. "ఇంత అహంభావం తనలో ఎలా వచ్చిందో" అనుకున్నాడు.

"వస్తానోయ్" అంటూ రఘు తన మోటారు సైకిలు ఎక్కాడు. ఇంతలో శర్మ కారు కూడా వచ్చి ఆగింది. "గుడ్ బై" అంటూ శర్మ కార్లో ఎక్కాడు.

కారు నడుస్తున్నది. శర్మ మనస్సును మరలించడానికేమో చేతిలోని పత్రిక తెరిచాడు. 'క్రైం' మన్న శబ్దంతోపాటు శర్మ ముందుకు తూలడంతో ముందుకు చూశాడు. పిచ్చివాడు కారుకు అడ్డంగా నిలుచున్నాడు.

"ఏయ్...చావదలచుకున్నావా-తప్పుకో" అని గదమాయించాడు డ్రైవరు. పిచ్చివాడి నుదుటినుంచి రక్తం ప్రవహిస్తున్నది. రక్తాన్ని చూసేటప్పటికి శర్మకు ఒళ్ళు జలదరించింది. "నన్ను కారో ఎక్కించుకో" అంటూ పిచ్చివాడు ఫుట్ బోర్ మీదికి ఎక్కాడు. "నీ బ్రతుక్కు కారు కూడానా" అంటూ డ్రైవరు పిచ్చివాడిని నెటివేశాడు.

"స్టుపిడ్...ఎవరిననుకున్నావ్? జాగ్రత్త...నీమీద పైకి వ్రాశానంటే ఉద్యోగం ఊడుతుంది" అని పిచ్చివాడు గద్దించాడు. డ్రైవరు ఫక్కున నవ్వేసి, "పోరా పిచ్చాడా" అంటూ గేరు మార్చాడు. "పోనీలే, ఎక్కనీ జోసఫ్" అంటూ తలుపు తెరిచాడు శర్మ. డ్రైవరు ఆశ్చర్యంగా శర్మ మొఖంలోకి చూసి కారు ముందుకు పోనిచ్చాడు.

పిచ్చివాడి ఒంటిమీదినుంచి వచ్చే దుర్వాసన తట్టుకోడానికేమో శర్మ సిగరెట్ వెలిగించాడు. పిచ్చివాడు శర్మ కాలుస్తున్న సిగరెట్ వంక చూశాడు. వెంటనే దృష్టి మరల్చి ముఖానికి చేతులు కప్పుకొని ఏడుస్తున్నాడు.

శర్మకేమీ అర్థంకాక "ఎందుకూ ఏడుస్తున్నావు" అంటూ భుజం తట్టాడు. "ఏడ్వక ఏం చేయను—నవ్వమంటావా?" అంటూ పకపక నవ్వాడు. ఇంత ఏడ్పులో నవ్వెట్లా వచ్చిందా అని శర్మ ఆశ్చర్యపడ్డాడు. కేసు తీసి సిగరెట్ అందించాడు. పిచ్చివాడు సిగరెట్ ముట్టించి రెండు మూడు గుక్కలు పీల్చాడు.

"భలే బాగుంది సిగరెట్...అబ్బ......

విన్నాళ్ళయింది...ఇంత మంచి సిగరెట్ తాగి. ఈ మధ్య అన్నీ ఎంగిలి పీకలేగా కాల్చింది" అంటూ పొగ వదులుతున్నాడు.

"ఐయాం వెరీ గ్లాడ్ టుసీయూ" అన్నాడు పిచ్చివాడు. శర్మ ఏమీ మాట్లాడకుండా చూస్తూ కూర్చున్నాడు.

పిచ్చివాడు దర్జాగా కాలుమీద కాలు వేసుకొని, సిగరెట్ పొగను విలాసముగా వదులుతున్నాడు ముఖంమీద తగిలిన గాయంనుంచి నెత్తురు చిమ్మి శివుడి మూడో కన్నులా వుంది. సంతృప్తిగా సిగరెట్ కాలుస్తున్నాడు. కొన్ని క్షణాలు గడిచాయి. పిచ్చివాడు సిగరెట్ బైటికి విసిరాడు. ఉన్నట్టుండి ముఖం గంభీరమైంది.

"మీరింత ద్రోహం చేస్తారనుకోలేదు. నాకు ఇస్తానన్న ఉద్యోగం మరొకరికి ఇచ్చారుకదూ?.. మీ అన్యాయాన్ని ఎదురించేవాళ్ళెవరూ? అవునులెండి-మిమ్మల్ని అనడం దేనికి-నేను దురదృష్టవంతుణ్ణి" అని పెదవి విరిచాడు.

"నీ పేరేమిటి?"

"నా పేరా?...అహ అహ్హ అహ... తెలీదూ?...ఏమిటో నా పేరు?...నిజం చెప్పండి—నేను పిచ్చివాడ్నా?...... అవును——నేను పిచ్చివాడినే. నా పేరు అదే," అని నవ్వుకున్నాడు.

"నన్నెప్పుడైనా చూశావా?" మళ్ళీ శర్మ ప్రశ్నించాడు.

పిచ్చివాడు శర్మ ముఖంలోకి పరిశీలనగా చూసి, "ఆఁ- చూశాను...అవును నువ్వే కదూ_ఇందాక అక్కడ సిగరెట్ ఇవ్వబోయి మళ్ళీ దాచేసుకున్నావ్? ఊఁ... ఇప్పుడెందుకిచ్చావ్ సిగరెట్?... చూశావా... నేను పిచ్చివాడినా?" అని వికటంగా నవ్వి, చిరిగిపోయిన చొక్కా జేబులోంచి మూడు పుల్లలు తీశాడు.

"ఇదుగో తమ్ముడూ...ఇవ్వేమిటో తెలుసా? ఊఁహూ......నీకు తెలియదు. ఇదిగో—ఇది సత్యం, ఇది శివం, ఇది సుందరం. తెలిసిందా! ఈ మూడింటితోనేగా ప్రపంచం. ఏం—ఒప్పుకుంటావా?" అన్నాడు. శర్మ 'ఊఁ' అన్నాడు.

"అయితే ఈ మూడింట్లో ఏది లేకపోయినా ప్రమాదమేగా" అని మళ్లీ ప్రశ్నించాడు పిచ్చివాడు.

శర్మకేమనాలో తోచలా. తత్వవేత్తలు తలపట్లు పట్టుకోవలసిన సమస్య అని మాత్రం అనుకున్నాడు.

"ఏమిటో—అంతా మాయ" అంటూ నిట్టూర్చాడు పిచ్చివాడు.

ఇంతలో ఒక డిస్పెన్సరీ ఎదురైంది. డ్రైవరును కారాపమన్నాడు శర్మ. శర్మ క్రిందికిదిగి, పిచ్చివాడిని కూడా దిగమన్నాడు.

"ఈ పప్పులు మన దగ్గర ఉడకవు" అంటూ పిచ్చివాడు పీఠం వేసుకు కూర్చున్నాడు. శర్మ నవ్వుకొని, "ఆ దెబ్బకు కట్టు కట్టించుకొని మళ్లీ ఎక్కుదాం" అంటూ పిచ్చివాడి చెయ్యిపట్టుకొని దింపబోయాడు దిగనని పిచ్చివాడు కొంతసేపు పెనుగులాడినా, దిగి, కట్టు కట్టించుకోక తప్పింది కాదు.

మళ్ళీ కారు పరుగెత్తుతున్నది. పిచ్చివాడు మౌనంగా కూర్చున్నాడు. మధ్యమధ్య తనలో తనే నవ్వుకుంటున్నాడు.

"ఈ పిచ్చివాణ్ణి చూసి కారణ జాతు





"కూడా మతిపోయిందనుకుంటుందేమో" అనుకుంటూ శర్మ పిచ్చివాడివంక చూశాడు. కాలుమీద కాలువేసుకొని దర్జాగా సీటుకు ఆనుకొని కూర్చున్నాడు పిచ్చివాడు. ఏవి ఆలోచనలు అతనిలో పరుగులుతీస్తున్నాయో కాని ముఖంలో ఏదో సంతృప్తి, పెదవులపై చిరునవ్వు తారట్లాడుతున్నాయి. ఉండి ఉండి పిచ్చివాడు పెద్దపెట్టున నవ్వేశాడు. క్షణంలో ఆ నవ్వాపి, శర్మవంక సూటిగా చూశాడు.

"అదే చూపు...ఎక్కడో...ఏ సంవత్సరంలోనో? ఇతనెవరై వుంటారు? ఆఫీసులో అందరినీ గడగడలాడించగల తను ఇతనికెందుకు లొంగిపోతున్నాడు," అని తర్కించుకుంటున్నాడు శర్మ.

"నన్ను అంతా మోసంచేశారు...దగాపడిపోయాను బ్రదర్. ఏమంటావ్? చెప్పవూ" అవున్లే. నీకేం తెలుసు?- ఎవరో పిచ్చివాళ్ళు అనుకుంటారు- నేను మోసపోయాననీ, దగాపడ్డాననీ. నిజంగా నేనిప్పుడు రాజాలా ఉన్నానుకదూ? పైగా నన్నే అంతా పిచ్చివాడినంటారు ఆఖరికి శారద కూడా నన్ను పిచ్చివాడినంది. అంటూ అతను మళ్ళీ అరచేతుల్లో ముఖం దాచుకొని ఏడుస్తున్నాడు. ఈ చివరిమాటలతో నిజంగానే శర్మకు మతిపోయినట్లనిపించింది.

అతణ్ని పిచ్చివాడనుకోవాలో, మంచివాడనుకోవాలో శర్మకి అర్థంకాలేదు.

"శారద ఇతనికెట్లా తెలుసు? ఇతణ్ణి గురించి శారద ఎప్పుడూ తనతో చెప్పలేదే! ఇతను చెబుతున్నది ఇంకే శారదనుగురించో," అనుకుంటున్నాడు శర్మ.

మరికొన్ని నిముషాల్లో కారు శర్మ ఇంటి ముందు ఆగింది. శర్మ కారులోంచి దిగుతూ పిచ్చివాణ్ణికూడా దిగమన్నాడు. "ఎందుకూ?" అంటూనే అతను దిగాడు. కారు హారన్ విని శారద వచ్చి ఎదురుగా హాల్లో నిలుచుంది. చిట్టిబాబు తల్లి కొంగు లాగుతూ కారువంక చూస్తున్నాడు. మామూలుగా కేరింతలు వేస్తూ తండ్రికి ఎదురుగాపోయే చిట్టిబాబు, పిచ్చివాణ్ణి చూసి భయపడ్డాడేమో 'కెవ్వు'న కేకపెట్టి తల్లి కాళ్ళను చుట్టేసి ముఖం దాచేసుకున్నాడు. శారద భయభ్రాంతులతో వచ్చేవారిని చూస్తున్నది. చిట్టిబాబును అక్కున చేర్చుకొని శర్మ కంటే ముందుగానే పిచ్చివాడు చరచర వెళ్ళి కుర్చీలో మఠం వేసికొని కూర్చున్నాడు. శర్మ నవ్వుకుంటూ లోనికివెళ్ళాడు.

"ఎవరండీ వెంట తెచ్చారు? ఆ బట్టలూ ఆ వాలకం" అని శారద అంటుండగానే,

"పిచ్చివాడిలాగా వున్నాడుకదూ" అన్నాడు శర్మ.

"సందేహంలేదు. పిచ్చివాడిని కొంపలోకి తెస్తారటండీ-మీరు మరీ"ను, ఓమంచీ లేదు-చెడూలేదు, చిట్టిబాబు హడలిపోయాడు చూశారా" అంది శారద.

"మరేం ఫరవాలేదు... మననేం పీక్కుతినడులే. పాపం బాగా చదువుకున్నవాడిలా వున్నాడు. కాస్త మతిచెడింది అంతే" అంటూ శర్మ బట్టలు మార్చుకొనివచ్చి పిచ్చివాడిదగ్గరే సోఫాలో కూర్చున్నాడు.

పిచ్చివాడు చూపు ఆనినంతవరకు ఇల్లంతా కలియచూస్తున్నవాడల్లా శర్మను చూడగానే ఒకసారి నవ్వి "ఆకలి వేస్తున్నది. తినడానికేమైనా పెడవూ" అన్నాడు. ఆ అమాయకపుమాటలో శర్మకు పిచ్చివాడిమీద అమితంగా జాలి కలిగింది. శర్మ చెప్పకుండానే బాయ్ రెండు ప్లేటలో టిఫిన్ తెచ్చి ఇద్దరి ముందూ పెట్టివెళ్ళాడు.


శారద చిట్టిబాబును మాలికి ఒప్పజెప్పి వచ్చి తలుపుచాటున నిలబడింది. పిచ్చివాడెంత ఆకలితో వున్నాడో టిఫిన్ కూడు నిముషాల్లో ముగించాడు. బాయ్ అరటిపళ్ళు తెచ్చి బల్లమీద పెట్టాడు. పిచ్చివాడు చకచకా పళ్ళుతోలుతీసి మింగేస్తున్నాడు. కొంతసేపటికి ఆకలి చల్లారిందేమో "టిఫిన్ చాలా బాగుంది" అన్నాడు. ఆమాటలతో తలుపుచాటునవున్న శారద ఉలిక్కిపడింది.

"ఎవరిదీగొంతు. తనకు చాలా పరిచయమైందదే" అనుకొంటూ తొంగి చూసింది. ఆనందాశ్చర్యాలతో ఆమె ఒళ్ళు జలదరించింది. అగుర్రాగా ఏమో అనబోయిందిగాని మాట పెగిలిరాలేదు. పెదిమలు కంపించిపోయాయి. తలతిరుగుతున్నట్లు ఒళ్ళు తూలిపోతున్నట్లు అనిపించి, ఇక అక్కడ నిలబడలేకవెళ్ళి మంచంమీద వాలిపోయిందిశారద. ఆమెలో ఎన్నాళ్ళనుంచి ఎంత ఆవేదన అణగివుందో, ఎంత వ్యధను దాచుకుందో పిచ్చివాణ్ణి చూసేప్పటికి అవన్నీ పెల్లుబికాయి. దుఃఖం పొర్లిపొర్లి వచ్చింది. తన ఏడుపు బైటవారికి వినపడుతుందేమోనని దిండులో ముఖం దాచుకొంది.

"పుట్టడం, బ్రతకడం, చావడం ఎందుకు జరుగుతున్నాయంటావు బ్రదర్" పిచ్చివాడు.

"ఏమిటీ ప్రశ్న? ఇంతవరకు తనకెప్పుడూ సందేహమే కలగలేదే" అనుకున్నాడు శర్మ.

అసలీసమస్యనుగూర్చి ఆలోచించాల్సిన అవసరంగానీ, పరిస్థితిగాని శర్మకెప్పుడు రాలేదు. ఇటువంటి చిక్కుప్రశ్నలతో సందేహాలతో తర్కవితర్కపడుతున్నవాడిని పిచ్చివాడని ఎలా అనుకోవడం? విజ్ఞాన సంపన్నుడైతే. మధ్యలో మారుతుంటే ధోరణి, వాలకంచూస్తే పిచ్చివాడనడానికి సందేహంలేదు. తను

మాట్లాడకుండావుంటే అతనే సమాధానం కూడా చెబుతాడేమో అనుకున్నాడు శర్మ.

"ఏం బ్రదర్! పుట్టడం ఎంతసహజమో చావడం కూడా అంతే సహజం కదూ? అయితే బ్రతకడంలోనే ఏదో నిగూఢమైన సత్యంవుంది. నేను ఎందుకు బ్రతుకుతున్నట్లో చెప్ప తమ్ముడూ" అన్నాడు పిచ్చివాడు. ఇది మహా చిక్కు ప్రశ్నగానే తోచింది శర్మకు. నిజంగా అతనెందుకు బ్రతుకుతున్నాడో శర్మకు మాత్రం ఏం తెలుసు? "బహుశః ఇతను ఈ అన్వేషణలోనే పిచ్చివాడయ్యాడేమో" అనుకున్నాడు.

"ఏమిటి తమ్ముడూ ఆలోచిస్తున్నావ్? నేనిట్లా ఎందుకు వాగుతున్నాననా?... నిజమే ఎందుకు వాగుతున్నానో నాకూ తెలియదు." అన్నాడు పిచ్చివాడు.

వికలమైన మనస్సుతో పరిపరి విధాల ఆలోచనలతో మంచంమీద పడుకున్న శారదకు ప్రక్కగదిలోని మాటలు వినవస్తూనే వున్నాయి.


"మా అత్తయ్య వస్తేప్పుడూ అంటూ వుండేది — పూటకు గతిలేని వెధవ అని - అందుకే ఆమె శారదను నాకు కాకుండా చేసింది. అయినా ఇప్పుడు నాకేం తక్కువ కాజాలాగా లేనూ?" అన్నాడు పిచ్చివాడు.

"శారద ఎవరూ?" సందేహ నివృత్తి కోసం అడిగాడు శర్మ.

"ఎవరో? ఎవరని చెప్పను. ఏమో ఎవరో? అసలు నాకేమవుతుంది శారద? అబ్బే ఏమీ కాదు" అని పిచ్చివాడు మళ్ళీ మోకాళ్ళ మీద ముఖం ఉంచుకొని ఏడుస్తున్నాడు. శర్మ సిగరెట్ ముట్టించి ఆలోచనలోపడ్డాడు.

ఈ మాటలతో శారద హృదయం మీద గాజు ముక్కతో గీరినట్లు బాధపడింది. "వేణుకు నేనేమీ కానూ?" అని ప్రశ్నించుకుంది.

"నిజంగానే అమ్మ వేణుకు అన్యాయం చేసింది. నాన్న గుండెజబ్బుతో హఠాత్తుగా పోకపోయినట్లైతే వేణు ఎం. ఎ. పూర్తి చేసేవాడు. తనూ బి. ఏ. పూర్తిచేసేది. వేణు తల్లిదండ్రులకు కరవై తమ మీదఆధారపడి వున్నాడనేగా అమ్మకు వేణు అంటే చులకనై పోయింది. తనంటే వేణుకెంత ప్రాణం? నాన్న పోవడంతో వేణుకు ఇంట్లో స్థానం లేకపోయింది. ఎప్పుడూ సాధింపులతో, సూటిపోటి మాటలతో అమ్మ ఆడిపోసుంటే తనే భరించలేకపోయేది — ఇక వేణేం సహించగలడు? ఎక్కువగా స్నేహితులతో గడుపుతూ, ఉద్యోగాలకోసం తిరిగే వాడు. ఎప్పుడైనా తనకోసమే ఇంటికి వచ్చే వాడు. వేణు అలా వచ్చివున్న కొద్ది క్షణాల్లోనైనా మనసిచ్చి మాట్లాడటానికి అవకాశం లేకుండా అమ్మ వెంటవెంట వుండేది.



ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య 70 వ జన్మదినోత్సవం ఇటీవల ఆంధ్ర రాజధానిలో జరిగిన సందర్భంలో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి శ్రీ సత్యనారాయణరాజు. మధ్యలో కూర్చున్నవారు శ్రీ వెంకటరంగయ్య.

అదే ఆఖరిరోజు, తను స్వహస్తాలతో కాఫీ ఫలహారాలివ్వడం — మనసిచ్చి మాట్లాడటం కూడా. ఆ రోజు వేణు వస్తాడని తనకు తెలుసు. అదృష్టవశాత్తు అమ్మ ఆ రోజు ప్రక్కయింటివారితో హరికధ వింటానికి వెళ్ళింది. తను పెటిన మైసూరుపాక్, బజ్జీలు తిని "టిఫిన్ చాలాబాగుంది శారదా" అంటూ వేణు తనను అభినందించాడు. తను ఇంటర్వ్యూకు పట్నం పోతున్నాననీ, ఆ ఉద్యోగం దొరికితే మొదట మూడు వందలకు తక్కువ వుండదనీ చెబుతూ, అప్పుడు కూడా మీ అమ్మ నన్ను గతిలేనివాడి నంటుందేమో" అన్నాడు. "ఊరుకో బావా- అమ్మ మాటలకేంలే. ఇప్పుడుమటుకు నీకేం తక్కువైంది." అంటూ తను కాఫీ అందించింది. కాఫీగ్లాసు టేబిలుమీద పెట్టి "నన్ను మరచిపోవుగదూ" అంటూ వేణు తన చెక్కిళ్ళు నిమురుతూ కళ్ళల్లోకిచూసి జాలిగా అడుగుతుంటే "నీ వుత్త పిచ్చివాడివి బావా!... నేనెప్పుడూ నీదాన్నే" అంటూ చేతిలో చేయివేసింది. ఇంతలో అమ్మ రావడంతో వేణు కొంత సేపు మాట్లాడి వెళ్ళిపోయాడు. ఆ తరువాత మళ్ళీ వేణు కనిపించనేలేదు. వస్తుందనుకున్న ఉద్యోగం కాస్తా ఎవరో గద్దలా తన్నుకు పోయారనీ, వేణు ఇంకా ఉద్యోగ ప్రయత్నంలోనే పట్నంలో తిరుగుతున్నాడనీ అమ్మతో ఎవరో చెబుతూంటే విని ఆ రోజంతా తనెంత ఏడ్చింది. అతని రాక కోసం తను ఎదురుతెన్నులు చూడటంతో కన్ను కాయలు కాచాయి.

"శారదా!" అన్న పిలుపుతో ఆమె ఆలోచనలు చెదిరిపోయాయి. "తను అక్కడకు వెళ్ళితేమా-మానేనా? వెళ్ళకపోతే ఆయన ఏమనుకుంటారు?... వెళితే వేణు గుర్తుపట్టి పలుకరిస్తాడేమో?" అన్న ప్రశ్నలు ఆమెను వేధించాయి. ఆమె ఆలోచించడానికికూడా అవకాశంలేకుండా శర్మ శారదను మళ్ళీ పిలిచాడు. 'ఆఁ' అంటూ ఆమె డ్రాయింగు రూములోకి వెళింది.

"చిటిబావేడీ?"

"మాలి బెట ఆడిస్తున్నట్టున్నాడు"

పిచ్చివాడు శారదను పరికిలనగా చూస్తున్నాడు. ఆమె హృదయాన్ని పదిలపరచుకొని పిచ్చివాడినీ, శర్మనూ చూస్తున్నది.

"ఎవరీమె?...ఎక్కడో చూసినట్టుందే ...ఉహూఁ...ఆఁ...ఆఁ... ఇందాక కాదు దిగంగానే చూశాంకదూ? నన్ను చూసి, మీరూ మీ బాబూ భయపడారుకదూ... అవును. నేను పిచ్చివాడినికదూ...అంతా నన్ను పిచ్చివాడనే అంటారు. నీవు నిజం చెప్పమ్మా? నేను పిచ్చివాడినా?" అని ప్రశ్నించాడు. శర్మ పిచ్చివాడిమాటల్ని శ్రద్ధగా వింటున్నాడు. శారదకు లోపల ఒక ప్రక్క విచారం, మరో ప్రక్క ఆశ్చర్యం కలిగాయి "మతిచెడితే మనుషుల గుర్తుకూడా తెలీదేమో." అనుకుంటూ, "ఇంతబాగా మాట్లాడుతూవుంటే మిమ్మల్ని పిచ్చివాడని ఎవరంటారు?" అని తెచ్చిపెట్టుకున్న చిరునవ్వుతో శర్మవైపు చూసింది.

"రైట్... నేను పిచ్చివాణ్ని కాదు

(63 వ పేజీ చూడండి)

(85-వ పేజీ తరువాయి)

కాదంటే కాదు. ఈ శుభసమయంలో నన్నెవరూ అభినందించరేం?—బాబొంద. పిచ్చివాడిని ఎవరు అభినందిస్తారు;...అవును ...నేను పిచ్చివాడినే. అందుకే అందరూ నామీద కాల్చిపారేసిన సిగరెట్ పీకలు, రాళ్ళు విసిరేస్తారు...ఆఁ...బైదిబై నాకు ఇవ్వాళ్ళ కడుపునిండా అన్నం పెడతారు కదూ" అన్నాడు పిచ్చివాడు.

"ఓ...తప్పకుండా" అన్నాడు శర్మ...

రాత్రి భోజనాలు అయినాయి. పిచ్చివాడు భోజనం అయినంతసేపూ ఏదో ఒకటే మాట్లాడుతూనే వున్నాడు. శారద హృదయం కొంత సంతృప్తితో, కొంత ఆందోళనతో త్రొక్కిసలాడుతున్నది. శర్మకు పిచ్చివాడిమీద ఏదో తెలియని సానుభూతి కలుగుతున్నది. భోజనాలు అయిన తరువాత పిచ్చివాడు సొమ్మసిల్లినట్లు పడుకున్నాడు. మరికొంత సేపటిలోనే పిచ్చివాడిని గాఢంగా నిద్ర ఆవరించింది. శర్మకు అతణ్ణిగూర్చి సరిగ్గా ఆలోచించడానికి సమయం దొరికింది. శారద ఏదో అల్లుకుంటూ కూర్చుంది.

"సందేహం లేదు—సరిగ్గా నాలుగు సంవత్సరాల్రకిందట ఇతణ్ణి చూశాడు తను. ఇతనికి రావాల్సిన ఉద్యోగాన్నే తను సిఫార్సులతో సంపాదించాడు. ఆరోజు ఆ ఉద్యోగం ఇతనికి దొరికివుంటే, తను ఇప్పుడున్నంత హోదాలోనే వుండేవాడుకదూ. పాపం, తరువాత మరే ఉద్యోగంకూడా దొరకలేదేమో! ఇతనంటున్న శారద ఎవరో? గాఢంగా ప్రేమించి—వుంటాడు. ఆమె కూడా ఇతనికి అందని పండవడంవల్ల మతి చలించివుంటుంది. అప్పుడే బ్రతకడమెందుకు? అన్న ప్రశ్న ఎదురైవుంటుంది. పుట్టడం, బ్రతకడం, చావడం అనే మీమాంసకూడా అప్పుడే కలిగివుంటుంది. అనే తర్క వితర్కంలోకి దిగాడు శర్మ. "ఇతనిలా పిచ్చివాడవడానికి తను కారకుడు కాడుగదా?" అని ప్రశ్నించుకున్నాడు. 'కా'దని సమాధాన పరచుకోడానికి ధైర్యం చాలలేదు. కిటికీలోంచి వానజల్లు మీదపడడంవల్ల శర్మ ఆలోచనలకు అంతరాయం కలిగింది. లేచి కిటికీ రెక్కలు మూసివేశాడు. పత్రిక తీసుకొని కూర్చుంటూ అల్లుతూ కూర్చున్న శారదవంక చూశాడు. ఆమెకూడా దేన్నిగురించో ఆలోచిస్తున్నట్టు తోచింది శర్మకు. ఆమె అల్లికపనికూడా మందగించి జరుగుతున్నట్టు గుర్తించాడు. "దేన్ని గురించి ఆలోచిస్తున్నావో?" అనుకున్నాడు. ఈ విషయాల నుండి మనస్సును మళ్ళించడానికనేమో పత్రిక తెరిచాడు.

బైట వర్షం కుండపోతగా పడుతున్నది. దానికి తగినట్టే ఈదురుగాలి వీస్తున్నది. శారద చిట్టిబాబుకు బ్లాంకెట్ కప్పి పక్కనే పడుకుంది. కలత చెందిన మనస్సు నిదరపోనీయలేదు. అయినా కళ్ళు మూసుకునే పడుకుంది.

డ్రాయింగ్ రూములో పడుకున్న పిచ్చివాడికి మెలకువ వచ్చింది. ఒకసారి తలంతా బరుక్కున్నాడు. ఏం బుద్ధి పుట్టిందో ఏమో హాలులోకి వచ్చి పచార్లు చేస్తున్నాడు. ఇంట్లో నుంచి వెళ్ళిపోదామనేమో గేటుదాకా వెళ్ళాడు. గేటుకు తాళంవేసి వుండటంవల్ల అక్కడే చతికిలపడి కూర్చున్నాడు—వర్షంలో తడుస్తూ. వర్షం ధారాళంగానే పడుతున్నది. చలితో వణికిపోతున్నాడు. అయినా అక్కడినుంచి కదల్లేదు. ఉండి ఉండి ఎందుకో పకపక నవ్వేశాడు. పత్రికా పఠనంలో వున్న శర్మ ఆ నవ్వుకు త్రుళ్ళిపడి, హాలులోకి వచ్చి లైటు వేశాడు. చరచరా వెళ్ళి పిచ్చివాడిని వాటేసుకుని ఇవతలికి తీసుకువస్తూ "శారదా, శారదా" అని పిలిచాడు. అప్పటికప్పుడే కునుకుపడుతున్న శారద ఆదుర్దాగా లేచి వచ్చింది. "తొందరగా ధోవతి. చొక్కా తీసుకురా" అన్నాడు. ఆమె క్షణంలోనే అవి తీసుకొనివచ్చి మళ్ళీ లోనికి వెళ్ళింది. శర్మ పిచ్చివాడిచేత బలవంతాన బట్టలు మార్పించాడు. శారద తువాలు తీసుకువచ్చి "తల తుడుచుకోండి" అని ఇవ్వబోయింది. "అబ్బే నాకెందుకూ?" నిర్లిప్తంగా అన్నాడు పిచ్చివాడు. శర్మ తువాలు అందుకొని తుడవబోయాడు. పిచ్చివాడు తుడవనీయకుండా చేతులు అడ్డుపెట్టి, తల అడ్డదిడ్డంగా తిప్పాడు "నీవు తుడు శారదా, నేను పట్టుకుంటాను" అన్నాడు శర్మ. ఆమె సందేహించింది. శర్మ ఆజ్ఞాపిస్తున్నట్టు ఆమెవంక చూశాడు. ఆమె తల తుడిచింది. నుదుటికి కట్టిన కట్టంతా తడవడంవల్ల విప్పివేసింది. పిచ్చివాడు మళ్లీ పడుకొని చలికి వణికిపోతున్నాడు. శారద లోపలినుంచి దుప్పటి తెచ్చి శర్మకందించి వెళ్ళింది. పిచ్చివాడికి దుప్పటి కప్పి కొంతసేపు అక్కడే కూర్చున్నాడు శర్మ.

పిచ్చివాడు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. మెలకువవచ్చి మళ్ళీ వర్షంలోకి వెడతాడనేమో గదితలుపులు బైటకు బంధించి శర్మ తనగదిలోకి వెళ్ళాడు. శారద చిట్టిబాబు ప్రక్కనే పడుకొనివుంది. శర్మ లైటుతీసి వేయబోతూ ఆమెముఖంలోకి చూచాడు. ఆమె ఏడ్చిఏడ్చి పడుకుందేమో చెక్కిళ్లమీద కన్నీటి చారికలు కనిపించాయి. అవి అతని మెదడులో మళ్లీ ఆలోచనల్ని కదిపాయి. అతను లైటుతీసి తన పక్కమీదకి వెళ్లాడు.

"శారద ఎందు కేడ్చిందో? తను పిచ్చివాడిని తీసుకురావడం కష్టం కలిగించిందేమో? అయినా, ఇంతమాత్రానికే ఏడ్వాల్సిన అవసరం ఏముంది? ఉహూ.... ఆమె మనస్సులో ఏదో బాధ పడుతున్నది. పిచ్చివాడు ప్రేమించిన శారద ఈమె కాదు కదా? అయితే ఈ విషయం తనకు తెలియకుండా ఎలా దాచుకోగలిగింది? పిచ్చివాడు శారదను ఇవాళే తనతో ఇంటికివచ్చినప్పుడే చూసినట్టు మాట్లాడాడు. పోనీ పిచ్చివాడు మతి చలించినవాడు కాబట్టి పూర్వస్మృతి లేక శారదను గుర్తుపట్టక పోవచ్చు. మరి శారద అతణ్ణి పోల్చుకోలేక పోయిందా? ఉహూ... లేకపోతే ఇద్దరూ ఒకరినొకరు పోల్చుకొనే తెలియనట్టు నటిస్తున్నారా? ఒకవేళ శారద పిచ్చివాడు ప్రేమించిందే అయితే తననుకూడ స్వార్థపరుడుగా, ద్రోహిగా అంతా భావిస్తారేమో! దేవుడు కూడా మన్నించడేమో? అయినా తెలియక చేసిన వాటికి తను బాధ్యుడా? ఉద్యోగ విషయాలలో అనేక పోటాపోటీలు వస్తాయి. తత్కాలంగా ఒకరికి నష్టం కలుగవచ్చు. అంతమాత్రం చేత స్వార్థమనడం సమంజసమా?...నిజమే—తనది స్వార్థమే. ఆరోజు తను ఇంటర్వ్యూలో తప్పిపోయినప్పటికీ, సిఫార్సులతో ఒకరికిపోయే ఉద్యోగాన్ని


## నారసింహ లేహ్యము




బంగారుతో చేరినది. మేహము, ఎక్కాక, విస్పుత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును. 20 రు డబ్బి రు. 3-4-0. పోస్టేజి. 1-1-0

వి. ఎ. ఎ అండ్ కంపెనీ ఆయుర్వేద సమాజం, పెరిదేపి (PO) నెల్లూరుజిల్లా.

## శతమూలికాదిలేహ్యము

5 తత్వములు 100 మూలికలు చేరినవి. సెగ సవాయి మున్నగు సుఖవ్యాధులు, మేహ బాధ, మచ్చలు, పుండ్లు మాన్పి రక్తం శుభ్రపరచి బలము నరముల పటుత్వం కల్గించును. స్త్రీల బుతుబాధలు అమిత నొప్పి నష్టసంతానము నివారించి సంతానం కల్గించును కేటలాగు, సలహా ఉచితము.

శ్రీ భుజంగరాయ వైద్యశాల

తాళ్ళరేవు - తూర్పుగోదావరి.

# ★ అన్వేషణ ★

తను సంపాదించడం స్వార్థం కాదూ! శారదా వివాహం సరైందే కావచ్చు? ఇష్టపూర్వకంగా, ముఖ్యంగా శారద అంగీకారంతోనే వివాహం జరిగింది. తనకు ఇష్టం లేకపోతే, చదువుకున్నది కాబట్టి "నేను చేసుకోను" అని తెగేసి చెప్పచ్చు గాక! ఏమిటి తనింత పిచ్చిగా ఆలోచిస్తున్నాడు, తను శారదను శంకిస్తున్నాడా! ఎంత ద్రోహం! అసలు అలాగ దేనికి?" అనే ఆలోచనలు, సందేహాలు కలుగుతున్నాయి.

తెల్లవారింది. వర్షం, గాలి తగ్గిపోయి, ఒక విషాదఘట్టం జరిగిపోయినట్టుగావుంది వాతావరణం. శర్మ పిచ్చివాడిని లేపటానికని గదితలుపు తెరిచాడు. పిచ్చివాడు మూలుగుతున్నాడు. శర్మ పిచ్చివాడిమీద చెయ్యి వేశాడు. ఒళ్లు మసిలిపోతున్నది. ఎంత పిలిచినా పలక్కుండా గట్టిగా మూలుగుతున్నాడు పిచ్చివాడు. అతనికేంచేయాలో తోచలేదు. దరదరా ఇంటిలోకివచ్చి, "పిచ్చివాడికి ఒళ్ళు కాలిపోతున్నది శారదా! స్పృహ లేకుండా పడివున్నాడు" అన్నాడు. శారద ఓ క్షణం స్తంభించిపోయింది. "నేను కార్లో వెళ్లి డాక్టరిని తీసుకువస్తాను. కాస్త అతన్ని చూస్తుండు." అంటూ శర్మ ఆదుర్దాగా వెళ్లిపోయాడు. శారద కొంతసేపటికి తేరుకొని డ్రాయింగురూములోకి వెళ్ళింది. పిచ్చివాడు కళ్ళు మూసుకుని మూలుగుతూనే వున్నాడు. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి. అతని నుదుటిమీద చెయ్యివేసి "ఎంత దుర్గతి పట్టింది వేణూ" అని విలపించింది. ఆమె మాటలు కాని, ఏడుపుగాని వినే పరిస్థితిలో లేడతను. మరికొంతసేపటిలోనే శర్మ డాక్టరుతో వచ్చాడు. డాక్టరు వేణూ పరీక్షచేసి, "ఎందుకైనా మంచిది ఆసుపత్రిలో చేర్పించండ"ని డాక్టరు వెళ్లిపోయాడు.

వేణును ఆసుపత్రిలో చేర్పించారు. డాక్టరు చెప్పడం తడవుగా శర్మ, ఇంజక్షనులు, మందులు కొనితెచ్చాడు. శారదా శర్మల హృదయాలలో పిచ్చివాడిని గూర్చిన ఆందోళన ఎక్కువైంది. ఆసుపత్రిలో చేర్పినరోజు చిట్టిబాబును తీసుకొని ఆ దంపతులు అక్కడనే వుండిపోయారు. రెండు రోజులు దాకా మాటామంతీ లేకుండా వేణు మూలుగుతూ పడివున్నాడు. రోజూ సాయంత్రం శారద చిట్టిబాబును తీసికొని ఆసుపత్రికి వెళ్ళేది. శర్మ ఆఫీసునుంచి సరాసరి కారులో ఆసుపత్రికి వచ్చేవాడు.

నాలుగవ రోజు సాయంత్రం మామూలుగా శారద చిట్టిబాబును తీసికొని ఆసుపత్రికి వెళ్లింది. వేణుకింకా స్పృహ రాలేదు. కాని మూడురోజులకంటే పరిస్థితి బాగుంది. శారద అతని తలవైపు కూర్చుని నుదుటి మీద చెయ్యివేసింది. జాలితో ఆమె కళ్లలో నీళ్లు నిండాయి. రెండు కన్నీటి చుక్కలు అతనిమీద పడ్డాయి.

వేణు కళ్లు తెరిచి ఒకసారి చుట్టూకలియ చూశాడు. ముప్పిరిగొన్న ఆనందంతో శారదను చూసి, "నువ్వా శారదా!...అబ్బ ఎన్నాళ్లకు చూశాను...నాకిప్పుడెంతో హాయిగావుంది...నేను నీ పిల్లాడికదూ!... అదేమిటి ఏడుస్తున్నావా" అంటూ ఆమె గడ్డాన్ని పట్టుకున్నాడు.

"లేదు వేణూ...ఏడవడం లేదు. నీవు మళ్ళీ మనుష్యుల్లో పడినందుకు ఆనందిస్తున్నాను." అంది పమిటచెంగుతో కళ్ళు తుడుచుకుంటూ. ఇంతలో శర్మ అక్కడికి వచ్చాడు. పిచ్చివాడికి స్పృహరావడం చూసి 'తన శ్రమ ఫలించిందిగదా' అని సంతోషించాడు. వేణు కృతజ్ఞతతో శర్మకు నమస్కరించాడు. పిచ్చివాడి ధోరణి మారిపోయి మామూలుగా అందరిలా మాట్లాడటం శర్మకు మరింత సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. తను అతనికి చేసిన అన్యాయం తలపుకు వచ్చేప్పటికి సూటిగా వేణు ముఖంలోకి చూడలేకపోతున్నాడు. ఇంతలో డాక్టరు అక్కడికివచ్చి వేణును పరీక్షించి "మరింకేం భయంలేదు. కాని కొంత విశ్రాంతి అవసరం. రేపటికి పూర్తిగా కోలుకుంటాడు. ఇప్పుడే ఎక్కువగా మాట్లాడించకండి" అన్నాడు.

శారదా శర్మలు చిట్టిబాబుతో కార్లో ఇంటికి బయలుదేరారు. ఇదరు మౌనంగా వున్నారు. చిట్టిబాబువేసే ప్రశ్నలకు ఇద్దరు పరధ్యానంగా సమాధానా లిస్తున్నారు.

ఆ రాత్రి భోజనాలముందర కూడా మౌనంగానే గడచిపోయింది.

శారద అల్లిక ముందర వేసుకు కూర్చుంది. శర్మ పత్రిక తెరిచాడు. అతనికేమీ చదవ బుద్ధి పుట్టడంలేదు. ఆమె అల్లిక పనికూడా అంతమాత్రంగానే సాగుతున్నది.

శర్మ సిగరెట్ ముట్టించి "నేను పిచ్చివాడికి చాలా అన్యాయం చేశాను శారదా" అన్నాడు. శారద ఆశ్చర్యంతో భర్తవంక చూసింది.

"చెప్తే నన్ను అసహ్యించుకుంటావేమో?" అన్నాడు. ఆమె మౌనంగానే అతనికేసి చూస్తున్నది.

"నాకీ ఉద్యోగం తెలివి తేటలవల్ల రాలేదు. కౌటిల్యంతో పిచ్చివాడికి రావలసిన ఉద్యోగాన్ని సంపాదించాను. ఇది చాలా అన్యాయంకదూ!" అన్నాడు శర్మ.

"ఇదంతా తెలిసి వేణుకు తీరని ద్రోహం చేశాం" అంది శారద.

"ఆఁ...అన్నాడు" శర్మ.

సమాధానంగా శారద తన వివాహపూర్వపు సంగతులు వివరించింది.

"మనిద్దరం చేసిన అన్యాయానికి శిక్ష ఏమిటో?" అన్నాడు శర్మ.

"అతణ్ణి ఓ ఇంటివాణ్ణి చేయాలి."

"అతణ్ణి నా అంతటి హోదాగలవాడిగా చేయాలి".

ఇద్దరి హృదయాలూ తేలికపడ్డాయి.

మరునాడు మామూలుగా సాయంత్రం శారదా, శర్మలు చిట్టిబాబుతో ఆసుపత్రికి వెళ్ళారు. వేణు బెడ్‌మీద లేకపోవడంతో ఇదరూ ఆదుర్దాగా డాక్టరు దగరకు వెళ్లారు. ఆశ్చర్యంతో నర్సులూ, డాక్టర్లూ అంతటా వెతికారు. ఎక్కడా లేడు. "తలగడ క్రింద ఈ కవరు దొరికిం"దని ఒక నర్సు తెచ్చి శారద కిచ్చింది. కవరుమీద తనపేరే వుండటంచూసి, చదవమని భర్తకందించింది.

"శారదా!

నేను వెళ్ళిపోవడం మీ దంపతులకు ఆశ్చర్యంగానే వుంటుంది. మీ ఇద్దరివల్ల ఈవిధంగా పూర్వస్మృతి కలిగినందుకు ఎంతెనా కృతజ్ఞుణ్ణి. మన మెన్నో ఆశా సౌధాలు నిర్మించుకుంటాము. అవన్నీ పోయేప్పటికి మనంతటి దురదృష్టవంతులు లేరనుకుంటాం ఇది మానవసహజం. కొందరికి మతిభ్రంశంకూడా కలుగుతుంది. వారిలోని బలహీనతే కారణం అనుకుంటాను. ఇప్పుడు నాకు కోరికలూ లేవు. ఒక్కటిమాత్రం భగవంతుణ్ణి కోరతాను—మీ దంపతుల్ని చిట్టిబాబునూ చిరకాలాలపాటు కాపాడమని—"బ్రతకడమెందుకు" అనే ప్రశ్న ఎప్పుడో ఒకప్పుడు ప్రతివారికీ ఎదురౌతుంది. ఇప్పుడు నేను దీనినిగూర్చి ఆలోచించను. సృష్టి, స్థితిలయాలకు మూలకారణమేమిటో, భగవంతుని చిద్విలాసం ఎలా వుంటుందో తెలుసుకుంటానికి వెడుతున్నాను. అంతే. మీరిద్దరూ నాకేదో అన్యాయం చేశామని బాధ పడకండి. ఎవరి జీవితపరిణామం వారిదే కాని, ఒకరు ఒకరికి అన్యాయం చేశారనుకోడం పొరపాటని తలుస్తాను.

ఇట్లు,
నీ వేణు"

శర్మ ఉత్తరం చదవడం పూర్తిచేసేప్పటికి ఇద్దరికళ్ళల్లోనూ నీళ్లు నిండాయి.

"పిచ్చివాడు" అంది నర్సు.

"ఎవరు" అన్నాడు శర్మ.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.